## నల్లవాగుకు ఇన్‌ఫ్లో 1913 క్యూసెక్కులు


నల్లవాగు ప్రాజెక్టు దృశ్యం

**సిర్గాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** మండలంలోని నల్లవాగు జలాశయానికి 1913 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని ఐఈ ఏఈ శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు. 1898 క్యూసెక్కులు అలుగు ద్వారా ఔట్ ఫ్లో కొనసాగుతున్నట్లు చెప్పారు. ఫుల్ రిజర్వాయర్ లెవల్ 1493 ఫీట్లు కాగా 1493.58 ఫీట్ల వద్ద జలాలు స్టోరేజి ఉన్నాయి. ఎడమ పంట కాలువల ద్వార 15 క్యూసెక్కులు నీటిని వదిలినట్లు ఎఇ శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## విశ్వకర్మ లీగల్ అడ్వైజర్‌గా కేతోజు వినోద్‌చారి

**గజ్వేల్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** విశ్వకర్మ మనుమయ సంఘం లీగల్ అడ్వైజర్‌గా కేతోజు వినోద్ చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకటచారి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో విశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో గజ్వేల్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కేతోజు వినోద్ చారిని లీగల్ అడ్వైజర్‌గా ఎన్నుకొని ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాది వినోద్‌చారి మాట్లాడుతూ విశ్వకర్మ మనుమయ సంఘం సభ్యులకు, కుల బాంధవులకు ఏమైనా లీగల్ సమస్యలు ఉన్నా ఉచితంగా సేవలు అందించేందుకు ముందుంటానన్నారు. ఎలాంటి న్యాయ సలహాలు అయినా అందిస్తానని, న్యాయ పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విశ్వకర్మ మనుమయ సంఘం తరపున లీగల్ అడ్వైజర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కోశాధికారి అరునోజి లక్ష్మీనరసింహాచారి, ఉపాధ్యక్షుడు గడియారం వెంకటచారి, గడియారం స్వామిచారి, బాలచారి, న్యాయవాది కేతోజు వినోద్‌చారి, అరునోజి నరసింహాచారి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

## పశువైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉంచాలి : కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
పశువుల సంరక్షణకు శాఖపరమైన అన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పశువుల మేత కొరత లేకుండా చూడాలని..ఎప్పటికప్పుడు పశువిజ్ఞాన సదస్సులను నిర్వహించాలన్నారు. పశువులకు వ్యాధులు సంక్రమించకుండా ఎప్పటకప్పుడు సమీక్షించుకుంటూ టీకాలు అందించాలన్నారు. అన్ని పశు వైద్య శాలల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఫౌల్ట్రీ ఫాంలలో కోళ్లు చనిపోతే వాటిని సక్రమంగా తీసివేయాలన్నారు. ప్రతి ఫామ్‌కు తప్పనిసరిగా కాంపౌండ్ వాల్ ఉండేలా చూడాలని ఆదేశించారు. వనమహోత్సం కార్యక్రమంలో జిల్లాకు ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారి పూర్ణచందర్, సహాయ సంచాలకులు, మండల పశువైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హైమావతి మార్కెటింగ్‌శాఖ అధికారులు,వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## నేడు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### శంకుస్థాపనలు చేయనున్న మంత్రి దామోదర రాజనర్సింహ

**మునిపల్లి, ఆగస్టు 22 (ప్రభాతవార్త):** మండలంలోని వివిధ అభివృద్ధి పనులకు నేడు(శుక్రవారం) ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపనలు చేయనున్నారు. మండలంలోని బుధేరా మహిళా డిగ్రీ కళాశాలకు కాంపౌండ్‌వాల్ నిర్మాణం, 5 అదనపు గదులతో పాటు పలు అభివృద్ధి పనులకుగాను రూ. 2 కోట్ల 63 లక్షలు, రూ. 98 లక్షలతో ఖమ్మంపల్లి చౌరస్తా నుంచి ఖమ్మంపల్లి వరకు బిటి రోడ్డు, మునిపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్ మరమ్మతులకు రూ. 64 లక్షల 50 వేలు, రూ. 60 లక్షలతో టిజి మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ భవన నిర్మాణం పనులు, రూ. 34లక్షల 50 వేలతో మునిపల్లి బాలుర హాస్టల్‌కు, 1 కోటి 96 లక్షల రూపాయిలతో మునిపల్లి-చందాపూర్ రోడ్డుకు బిటి పనులు, 1 కోటి 26 లక్షలతో అల్లాపూర్ పిడబ్లు రోడ్డు నుంచి తక్కెడపల్లి వరకు బిటి రోడ్డు పనులు, 17 కోట్ల 70 లక్షలతో గార్లపల్లి బ్రిడ్జి నిర్మాణం పనులు, 94 లక్షల 50వేల రూపాయిలతో తాటిపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో మరమ్మతులు, కిచెన్‌షెడ్ తదితర పనులు, 42 కోట్ల రూపాయిలతో తాటిపల్లి నుంచి మక్తక్యాసారం వరకు డబుల్ లైన్ బిటి రోడ్డు నిర్మాణపు పనులకు నేడు మంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. మునిపల్లి మండలంలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరి చేసినందుకుగాను మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 10 అంగన్‌వాడీ, 8 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ. 2.40 కోట్లు మంజూరు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సిద్దిపేట నియోజకవర్గంలోని 10 అంగన్‌వాడీ, 8 గ్రామపంచాయతీల భవనాల నిర్మాణాలకు రూ.2 కోట్ల 40 లక్షలు మంజూరైనట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన 8 గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున రూ.1 కోటి 60 లక్షలు మంజూరు వచ్చినట్లు తెలిపారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారంపల్లి, బచ్చాయిపల్లి, అర్బన్ మండలం బక్రిచెప్యాల, బొగ్గులోనిబండ, చిన్నకోడూరు మండలం ఎల్లమ్మజాలు, కమర్సపల్లి, నంగునూర్ మండలం బద్దిపడగ, సంతోష్‌నగర్, నారాయణరావుపేట మండలం శేఖర్‌రావుపేట గ్రామ పంచాయతీల నూతన భవనాలకు నిధులు మంజూరు వచ్చినట్లు తెలపారు. అలాగే నియోజకవర్గంలోని 10 అంగన్ వాడీ భవనాల నిర్మాణలకు రూ.8 లక్షల చొప్పున రూ.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సిద్దిపేట రూరల్‌మండలం పుల్లూరు. ఇర్కోడ్, అర్బన్ మండలం బూర్గుపల్లి, మందపల్లి, చిన్నకోడూరు మండలం మేడిపల్లి, రామంచ.నంగునూర్ మండలం బద్దిపడగ,మగ్ధంపూర్, నారాయణ రావుపేట మండలం జక్కాపూర్(శనిగకుంట) గ్రామాల్లో నూతన అంగన్ వాడీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు వచ్చినట్లు వివరించారు.

### మార్వాడీ గో బ్యాక్

## నేడు రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు

**గజ్వేల్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** ఉస్మానియా యూనివర్సిటీ జేఏసి పిలుపు మేరకు మార్వాడీ గోబ్యాక్,రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకటచారి స్పష్టం చేశారు. గురువారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుండి వచ్చిన వారే తెలంగాణలో పెత్తనం కొనసాగిస్తున్నారని, రాష్ట్రంలో కచోరి సమోసా నుండి మొదలుకొని టీ కొట్టులు, మిఠాయి దుకాణాలతో పాటు చిన్న పెద్ద పారిశ్రామిక సంస్థలు నెలకొల్పి ఇక్కడి ప్రజల పొట్ట కొడుతున్నారన్నారు. మార్వాడీలమూలంగా విశ్వకర్మ కులవృత్తులు కనుమరుగవుతున్నాయని, విశ్వకర్మలకు పనిలేక కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గజ్వేల్‌లో ఏ షాపు చూసినా మార్వాడీల షాపులే ఉన్నాయని, ఏ పని కావాలన్నా మార్వాడీల వద్దకు వెళ్లడంతో పనిలేక వీధిన పడాల్సి వస్తుందన్నారు. కులవృత్తులు అంతరించిపోతున్నాయని, వడ్ల, కమ్మరి వారికి ఉపాధి లేక కులవృత్తి మరిచి కూలీ పనులకు వెళ్తున్నారని అన్నారు. గతంలో వ్యవసాయం కోసం రైతులు వడ్ల, కమ్మరి వద్ద పనిముట్లు తయారు చేసుకునే వారని, అది సైతం లేకుండా అంతా రెడీమేడ్ వ్యవస్థకు అలవాటు పడ్డారన్నారు. పట్టణంలో విస్తరిస్తున్న మార్వాడీ షాపులను ప్రభుత్వం కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. నేడు పట్టణంలో ఉన్న అన్ని కార్పెంటర్ షాపులు స్వచ్ఛందంగా బంద్‌చేసి నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో పట్టణ కోశాధికారి అరునోజి లక్ష్మీనరసింహాచారి, ఉపాధ్యక్షుడు గడియారం వెంకటచారి, గడియారం స్వామిచారి, బాలచారి, న్యాయవాది కేతోజు వినోద్‌చారి, అరునోజి నరసింహా చారి, జనగామ నారాయణచారి, రమేష్‌చారి, శ్రీనివాస్‌చారి, భానుచారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గడియారం వెంకటచారి

# గిరిజనుల అభివృద్ధికి సహకరిస్తా

### మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 21,ప్రభాతవార్త :**
పదేళ్లలో ఏంచేయనివారు మరో మూడేళ్లలో వచ్చి చేస్తామని చెబుతున్న బిఆర్ఎస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మె పరిస్థితుల్లో లేరని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు.హుస్నాబాద్ పట్టణంలోని బంజారా భవన్‌లో గురువారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సేవలాల్ మహరాజ్‌కి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సంప్రదాయకంగా మంత్రికి తలపై మహిళలు గోధుమల మొలక బుట్ట పెట్టారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్‌గౌడ్ బంజార మహిళలతో కలిసి నృత్యం చేసి మాట్లాడారు. 1978లో స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గిరిజనుల అభ్యున్నతికి ఎస్టీ హోదా కల్పించారని తెలిపారు. మెరీమాయాడ, సేవాలాల్ మహరాజ్ ఆశీర్వాదంతో అండగా ఉంటూ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. విద్యా, లక్ష్మీ కటాక్షం, ఆర్థికంగా ఉన్న వారు పేదలకు అండగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని రకాలుగా గిరిజనులకు అండగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎఎంసి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, మాజీ జడ్పీటిసి భూక్య మంగ శ్రీనివాస్, మాజీ ఎంపిపిలు లకావత్ మానససుభాష్, లక్ష్మీ భీలునాయక్, కాంగ్రెస్, గిరిజన నాయకులు వెన్న రాజు, అక్కు శ్రీనివాస్, బూరుగు కిష్టస్వామి, వీరన్న, భీమా సాహెబ్, గుగులోత్ శివరాజ్, వీరన్ననాయక్,రాజునాయక్, రమేష్ నాయక్, సత్యంనాయక్ తదితరులు పాల్గొన్నారు.


బంజార మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**రామాయంపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :**
సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం రామాయంపేట మున్సిపాలిటీని, 7వ వార్డులో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పరిసరాలను పరిశీలించిన అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వారం రోజులుగా భారీ వర్షాలు పడ్డాయని, వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించామన్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే ప్రజలు వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ నీరు నిలవలేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటితో బాటు, వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇండ్ల నిర్మాణ పనులు వేగం పెంచి త్వరిత గతిన పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో యూరియా సరఫరా పై ఆయన మాట్లాడుతూ జూలై ఆగస్టు మాసాలకు అవసరాన్ని తగ్గట్టుగా యూరియా నిల్వలు ఉన్నాయని వదంతులు నమ్మవద్దని సెప్టెంబర్ మాసానికి సంబంధించి 4వేల నుంచి 5 వేల మెట్రిక్ టన్నులు యూరియా ఇండెంట్ ఉన్నదని సెప్టెంబర్ లో కొనాల్సిన యూరియాను ఇప్పుడే కొనుగోలు చేసే విధంగా రైతులు క్యూ కడుతున్నారని రద్దీ నెలకొని ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులందరికీ అవసరమైన యూరియా అందుబాటులో ఉంచుతామని ఫర్టిలైజర్ షాప్ యజమానులు ఇతర ఎరువులు కొంటే యూరియా ఇస్తామని రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తో పాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మున్సిపాలిటీలో నిల్వఉన్న బ్లీచింగ్ పౌడర్ సంచులను పరిశీలిస్తున్న కలెక్టర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

## అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సమీక్ష

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 21 ప్రభాతవార్త :** క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం సమావేశం అయ్యారు. సంగారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లోఉన్న రహదారుల వివరాలు పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. నూతన రహదారుల మంజూరు చేయాలని పంచాయతీ రాజ్ మినిస్టర్ దృష్టికి కూడా లేఖ ద్వారా తెలియపరుస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు.శుక్రవారం ప్రారంభం కానున్న పనుల జాతర కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ను పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు ఆహ్వానం అందించారు.కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్‌శాఖ ఈఈ యుగేందర్,డిఇలు దీపక్, సుభాష్ ఉన్నారు.

## సదాశివపేట మున్సిపల్ కమిషనర్ బదిలీ

**సదాశివపేట, ఆగస్టు 21(ప్రభాతవార్త):** సదాశివపేట మున్సిపల్ కమిషనర్ బదిలీ అయ్యారు. సురాజపేట మున్సిపల్ కమిషనర్‌గా ఉమా గురువారం నాడు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో నూతన కమిషనర్‌గా టి.శివాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వచ్చిన శివాజీ మంచిర్యాలలో పనిచేశారు.

## యూరియా కోసం రైతుల పడిగాపులు

**అక్కన్నపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మండలకేంద్రంలో యూరియా కోసం ఇతర గ్రామాల నుంచి వచ్చిన రైతులు నిద్ర, అన్నం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఫర్టిలైజర్ షాప్ ఎదుట జిరాక్స్ కాపీలతో వరుసలో నిలబడి నిరీక్షిస్తున్నారు. యూరియా వచ్చిందన్న సమాచారంతో వచ్చిన రైతులు షాపు ఎదుట వరుసలు కట్టుకొని చెట్ల కింద కూర్చుంటున్నారు. ఎంత సేపు ఎదిరి చూసిన యూరియా మాత్రం రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.


యూరియా కోసం ఎదురు చేస్తున్న రైతులు

# రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలి : ఎమ్మెల్యే

### యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**చిలప్‌చేడ్, ఆగస్టు 21 ప్రభాతవార్త :** యూరియా కోసం ప్రతిరోజూ క్యూలో నిలబడి విసిగి వేసారి బుధవారం చిట్కుల్ చౌరస్తాలో రెండు వేల మంది రైతులు ఆందోళనకు దిగారు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారికి మద్దతు పలుకుతూ ధర్నాలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి..బూటకపు మాటల రేవంత్ రెడ్డి సర్కారును ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. తక్షణమే రైతులకు సరిపడ యూరియాను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు చంద్రాగౌడ్, మన్సూర్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, భోగ శేఖర్, రమణాగౌడ్, సార రామాగౌడ్, వంచ భూపాల్ రెడ్డి, గౌరీశంకర్ గుప్త, చిలప్‌చేడ్ సొసైటీ చైర్మన్ రాం చెంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ అరిగే రమేష్, నాయకులు సంతోష్ మేఘమాల, పాశం శ్రీనివాస్ రెడ్డి, అమర్‌సింగ్, రమేష్‌గౌడ్, కల్లూరి హరికృష్ణ, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బెస్త లక్ష్మణ్, నరేందర్ రెడ్డి, కిషన్ రెడ్డి, పోచయ్య, ఇస్తారి, ఎల్లమయ్య , మహిపాల్‌రెడ్డి, సంతోష్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, సత్యం గౌడ్,పంబల్ల బిక్షపతి, వినయ్, ప్రసాద్ సద్దాం, నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు హాజరు కావడం జరిగింది.


ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి. రైతులు


మాట్లాడుతున్న సిపి డాక్టర్ అనురాధ

## అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### సిద్దిపేట సిపి అనురాధ

**నంగునూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సీపీ డాక్టర్ బి.అనురాధ ఆదేశించారు. నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్, రికార్డు, రూమ్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వినాయక మండపాల ఆర్గనైజర్లు, కార్యవర్గ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించాలన్నారు. గ్రామాలలో ప్రజలతో స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసాగించాలన్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి త్వరగా సమస్యలు పరిష్కరించాలన్నారు. పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెంచి కేసులు నమోదు చేయాలన్నారు. ఆమె వెంట సిద్దిపేట ఎసిపి రవీందర్‌రెడ్డి, సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్‌బి సిఐ కిరణ్, మొగిలి, సిసిఆర్‌బి సిఐ రామకృష్ణ, రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్, ఎస్‌బి ఎస్ఐ బాలకృష్ణ ఉన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందిస్తాం

### జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి


ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీచేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

**మిరుదొడ్డి, ఆగస్టు 21, ప్రభాతవార్త:** రైతులు యూరియా కోసం ఆధైర్య పడాల్సిన అవసరంలేదని సరైన సమయంలో యూరియా రైతులకు అందిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి తెలిపారు. యూరియా బస్తాల మాదిరిగానే నానో యూరియా సైతం ఉపయోగపడుతుందన్నారు. రైతులు నానో యూరియా ఉపయోగించాలన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో పాటు ఫర్టిలైజర్, చెప్యాల చౌరస్తాలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని డిఏవో స్వరూపరాణి ఎవో మల్లేశంతో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి రైతులకు ఇబ్బందులు కలగకుండా యూరియా వచ్చిన వెంటనే సరఫరా చేయాలని సూచించారు, యూరియా తీసుకున్న ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్ చేసి రశీదులు అందించాలన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆగస్టు నెల వరకు 39 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా నేటికి 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావడం జరిగిందన్నారు. గతంలో కంటే ఈ యేడు 50 వేల ఎకరాలలో సాగు పెరగడంతో యూరియా కొరత వచ్చిందన్నారు. మండలంలో రైతులకు సరిపడా యూరియా అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొక్కకు కావాల్సిన పోషకాలు నానో యూరియాలో సైతం లభిస్తాయన్నారు. యూరియా దొరకదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి రైతుకు సరిపడా యూరియా అందిస్తామన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ

## భూ రిజిస్ట్రేషన్ వివాదం

### పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

**చిన్నకోడూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గోనెపల్లి గ్రామానికి చెందిన యువకుడు ముష్కిరు రాజు తమకు చెందాల్సిన భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరి కాదని వెంటనే రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సలీం మియా ఎదుట గురువారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పెద్దమ్మ ముష్కిరు రామవ్వ, వజ్రవ్వల పేరుమీద ఉన్న భూమిని కుమారులు ముష్కిరు శ్రీనివాస్, మహేష్‌లకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని తెలుసుకొని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రిజిస్ట్రేషన్ నిలిపివేయలేమని తహసీల్దార్ చెప్పడంతో మనస్థాపానికి గురైన రాజు వెంట తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకొని ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. రాజు తండ్రి ముష్కిరు యాదయ్య శ్రీనివాస్, మహేష్ పేరిట రిజిస్ట్రేషన్ చేయొద్దని వారంరోజులక్రితం తహసీల్దార్‌కు విన్నవించారు. సర్వేనంబరు 310లో ఎకర 30 రెండు గుంటలు వంశపార్యపరంగా తమకు రావాల్సి ఉందని 60 ఏళ్లు కబ్జా, కాస్తులో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నామని బాధితులు తెలిపారు. 2024-05 సంవత్సరంలో రెవెన్యూ అధికారుల తప్పిదంతో మా పేరు మీద రావాల్సిన భూమి తప్పుగా వారి పేరు మీద నమోదైందని తెలిపారు.తమకు చెందాల్సిన భూమి ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని వాపోయారు. దీంతో మహేష్,శ్రీనివాస్ పేరిట రిజిస్ట్రేషన్ చేయొద్దని ముష్కిరు రాజు తహసీల్దార్ ఎదుట ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. కబ్జాతో పాటు కాస్తులో ఉన్నమని, ఆ భూమిపై గ్రామంలో విచారణచేసి న్యాయం చేయాలని కోరినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సైఫ్ అలీ వెంటనే తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని బాధితునికి నచ్చచెప్పి కార్యాలయం నుంచి పంపించారు. కాగా పట్టాదారులు తమకు రిజిస్ట్రేషన్ చేయాలని లేదు కాస్తులో ఉన్నాం మాకే రిజిస్ట్రేషన్ చేయాలని ఇరు వర్గాలు కోరుతుండడంతో ఆ భూమిని రిజిస్ట్రేషన్ ఎవరికి చేయకుండా వారంరోజులపాటు నిలిపివేసినట్లు తహశీల్దార్ సలీం మియా తెలిపారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

## మత్తుపదార్థాల అక్రమరవాణాపై ప్రత్యేక నిఘా

**-అక్రమంగా కల్లుదుకాణాలు నడిపిస్తే కఠినచర్యలు**
**-నర్సాపూర్ ఎక్సైజ్‌శాఖ సిఐ గులాం ముస్తఫా**

**నర్సాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
గంజాయి కల్లులో కలిపి చేస్తున్న మత్తుపదార్థాల అక్రమరవాణాపై ప్రత్యేక నిఘావేసి ఉంచామని పేర్కొంటూ గ్రామాల్లో అక్రమంగా కల్లు దుకాణాలను నడిపిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎక్సైజ్‌శాఖ సిఐ గులాం ముస్తఫా హెచ్చరించారు. గురువారం నర్సాపూర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్ ఎక్సైజ్‌శాఖ పరిధిలోకి నర్సాపూర్, కౌడిపల్లి, శివంపేట్, మనోహరాబాద్, తూప్రాన్ తదితర మండలాలు వస్తాయని అన్నారు. ఈ మండలాల్లో నుంచి కల్లులో కలిపి డైజోఫామ్, క్లోరోఫామ్, గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమరవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేకనిఘా ఏర్పాటుచేస్తున్నామన్నారు. నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 28 కల్లు దుకాణాలలో దాదులు నిర్వహించి కల్లు శాంపిల్స్ సేకరించామని తెలిపారు. సేకరించిన కల్లు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు తరలించి పరీక్షలు చేసిన అనంతరం కల్తీ కల్లు అని నిర్ధారణ అయితే అట్టి కల్లు దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని ఆయన తెలిపారు. అంతేగాక కల్లు దుకాణాలలో శుభ్రత పాటించని 13దుకాణాలపై కేసులు నమోదు చేసి జరిమానా విధించామని తెలిపారు. గ్రామాలలో అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గంజాయి, మత్తుపదార్థాలు అమ్మినా, సరఫరా చేసినా, ఇళ్లలో నిలువపెట్టుకున్నా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో అనుమతులు లేకుండా అక్రమ కల్లు దుకాణాలను నడిపితే అట్టివారిపై చర్యలు తప్పవని అన్నారు. మత్తుపదార్థాలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు తమ సిబ్బందిచే వాచ్ రూట్ చేస్తూ వాహనాలు తనిఖీ చేస్తూ గట్టి నిఘా వేశామని తెలిపారు. మత్తుపదార్థాలను ఎవరైనా అమ్మినట్లు, రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎక్సైజ్‌శాఖ సిఐ గులాం ముస్తఫాతో పాటు ఎస్సైలు రాఘవేందర్, అజీజ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**-నర్సాపూర్ చౌరస్తాలో రైతుల రాస్తారోకో, స్తంభించిన ట్రాఫిక్**



రాస్తారోకో నిర్వహిస్తున్న మండల పరిధిలోని రైతులు తదితరులు

**నర్సాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
ప్రస్తుత పంటల సమయంలో పంటలకు కావలసిన యూరియా సరఫరా చేయడంలేదని రాష్ట్రప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ గురువారం నర్సాపూర్‌చౌరస్తాలో మండలపరిధిలోని రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ స్తంభించిపోయి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రైతులందరూ ఇదేమి ప్రభుత్వం, ఇదేమి రాజ్యం అంటూ పెద్ద ఎత్తున నినాదాలుచేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో యూరియా ఎరువులు రావడం లేదన్నారు. దీంతో రెండు మూడు రోజులపాటు యూరియా కోసం నర్సాపూర్లో పడిగాపులు కాస్తున్నట్లు తెలిపారు. అయినా ఏ ఒక్క అధికారిగాని, ప్రజాప్రతినిధులుగాని స్పందించిన పాపానపోలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనేస్పందించి నర్సాపూర్‌ప్రాంతానికి సరిపడా యూరియాను పంపించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ అధికారులు వచ్చేంతవరకు ధర్నా చేస్తామని భీష్మించుకు కూర్చున్నారు. ఎట్టకేలకు పోలీసులు రంగప్రవేశం చేసి ఎస్సై లింగం రైతులను సమదాయించి అధికారులతో ఫోన్లో మాట్లాడి ఎరువుల లారీని పంపిస్తామని చెప్పగా రైతులు ధర్నాను విరమించారు. ధర్నా విరమించిన అనంతరం రైతులు నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి వెళ్లి అక్కడ యూరియా కోసం వేచి ఉన్నారు. యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు నర్సాపూర్ ప్రాంతానికి సరిపడా యూరియాను పంపించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలి

**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్**



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ తదితరులు

**నర్సాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
ప్రస్తుత వర్షాకాలంలో సీజన్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్ అన్నారు. గురువారం నర్సాపూర్‌లో డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ పరిధిలోగల అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు, సిబ్బందితో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు వర్షాకాలంలో వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, ఇతరవ్యాధులు వ్యాపించకుండా జాగ్రతలు తీసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజన, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ నవ్య, వివిధ ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి...**
నర్సాపూర్ మండలంలోని మూసాపేట గ్రామంలో రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్యశిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీరామ్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజనతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సిహెచ్‌సి వైద్యాధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేవిధంగా వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

## సిఎం సహాయనిధితో పేదలకు ఎంతో మేలు

**-నర్సాపూర్ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి**

**శివంపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
సిఎం సహాయనిధితో పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని, ఎంతో మేలు జరుగుతుందని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. శివంపేట మండలంలో వివిధ గ్రామాల 24 మంది బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ రూ.8,60,000 చెక్కులను లబ్దిదారులకు ఆవుల రాజిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యంకోసం నిరుపేద కుటుంబాలకు మేలు జరగాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదవారిని దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా, మాజీసర్పంచ్ లావణ్యమాధవరెడ్డి, సీనియర్ నాయకులు కర్ణాకర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంతం, మాజీ జెడ్పిటిసి కమలాపుల్ సింగ్, మండల యూత్ అధ్యక్షులు అక్బర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జలకళ సంతరించుకున్న సింగూరు ప్రాజెక్టు



జలకళ సంతరించుకున్న సింగూరు ప్రాజెక్టు దృశ్యం

**పుల్‌కల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
గత వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకుతోడు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి వస్తున్ననీటిని ప్రాజెక్టు అధికారులు 6,8,9,10,11 నెంబర్ క్రస్ట్ గేట్లను ఎత్తి 10 టిఎంసిల నీటిని దిగువన ఉన్న మంజీరా బ్యారేజ్ అక్కడి నుంచి దిగువన ఉన్న ఘనపూర్, నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు రాతి ఆనకట్ట రివిట్మెంట్ కుంగిపోవడంతో ప్రాజెక్టు రక్షణ ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉందని నేషనల్ డ్యాం రివ్యూ సేఫ్టీ అధికారులు ఇచ్చిన నివేదికలో పేర్కొనడంతో ప్రాజెక్టు ఉన్నతాధికారులు సైతం ప్రాజెక్టు ఆనకట్టను పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు ఇరిగేషన్ అధికారులు జలాశయంలో నీటి నిల్వను పూర్తి స్థాయిలో కాకుండా ఓమోస్తరు స్థాయిలో 19,20 టిఎంసిలు మించకుండా మెయింటైన్ చేస్తూ దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 35వేల303 క్యూసెక్కుల నీరు వరద రూపంలో వస్తుండగా 5 గేట్లు ఎత్తి 40వేల821 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అవుట్‌ఫ్లో 43వేల417 క్యూసెక్కుల నీరు దిగువకు పోతుండటంతో భారీ మొత్తంలో వరదనీటి ప్రవాహం వృథాగాపోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 29917 టిఎంసిలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 18377 టిఎంసిల నీటిని అధికారులు నిల్వ ఉంచారు. ప్రాజెక్టు ఆనకట్ట రివిట్మెంట్ నీటిని అధికారులు నిల్వ ఉంచారు. తాగునీటి అవసరాల కోసం 150 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. వర్షాకాలం తరువాత ఆనకట్ట రివిట్మెంట్ మరమ్మతు పనులను మొదలు పెట్టనున్నారు. ప్రాజెక్టులోకివస్తున్న నీరు, దిగువకు వదులుతున్న నీరు, ప్రాజెక్టు ఆనకట్ట మరమ్మతుల విషయమై తరచూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నీటిపారుదలశాఖ అధికారుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు.

## యూరియా అందివ్వడంలో ప్రభుత్వం విఫలం

**-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



జిల్లా అధికారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరిపడ యూరియా అందివ్వడంలో పూర్తిగా విఫలమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం ఉదయం నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం వద్ద యూరియా బస్తాలకోసం గుమిగూడిన రైతులను గమనించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే రెండు లారీల యూరియా నర్సాపూర్‌కి పంపాలని కోరారు. యూరియా లారీ నర్సాపూర్ వచ్చిన వెంటనే ఒక్కొక్క రైతుకు రెండు లేదా మూడు బస్తాలు పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అక్కడే ఉన్న ఎస్ఐ లింగంతో మాట్లాడి రైతులకు యూరియా వచ్చిన వెంటనే తీసుకెళ్లండని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. ఈసమయంలో ఆమెవెంట మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షులు నయీం ఉద్దీన్, సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, ప్రసాద్, సూరారం నర్సింలు, పట్టణపార్టీ అధ్యక్షులు పంబల్ల బిక్షపతి, మండలపార్టీ అధ్యక్షులు భోగ శేఖర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తొంట వినయ్, సద్దాం, రాకేష్‌గౌడ్, సాయి, సాకేత్, సమీర్‌లు వున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఆవుల రాజిరెడ్డి



ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిస్తున్న ఆవుల రాజిరెడ్డి తదితరులు

**వెల్దుర్తి, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ధర్మారంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి నూతనంగా నిర్మించుకున్న ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి కల నిజమైందని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేదలకు వరమని ఆయన అన్నారు. నిర్మించుకున్న ఇళ్లను లబ్దిదారులు సద్వినియోగం చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మించడం జరుగుతుందని త్వరలో ప్రభుత్వం వాటిని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ముందుగా మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16 మంది సిఎంఆర్‌ఎఫ్ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు

**-తహసీల్దార్ బాల లక్ష్మి**

**వెల్దుర్తి, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
రాష్ట్రానికి కేంద్రం నుండి కేటాయించిన యూరియా ప్రతి సంవత్సరం లాగానే ఈసంవత్సరం కేటాయించడం జరిగిందని స్థానిక తహసీల్దారు బాల లక్ష్మి, ఎవో ఝాన్సీ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని సహకారసంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఫర్టిలైజర్ షాపును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా అందుబాటులో లేదని తప్పుడు ప్రచారం చేయవద్దని వచ్చేనెల కావాల్సిన యూరియా కూడా ఇప్పుడే కొనిపెట్టుకుందామనే ఆలోచనతో కృత్రిమ కొరత ఏర్పడుతుందని, అందుకు సెప్టెంబర్‌నెలలో కావాల్సిన యూరియా కేంద్రం నుంచి కచ్చితంగా ఆనెలలో సప్లైచేయడం జరుగుతుందన్నారు. రైతులు యూరియా దొరకదేమో అని భయంతో ఇప్పుడే కొనిపెట్టుకోవడం వలన యూరియాకు కృత్రిమ కొరత ఏర్పడుతుందని, అందుకు రైతులు సంయమనం పాటించి వచ్చే నెల అవసరం కోసం ఆనెలలో వచ్చే యూరియాను కొనాలని అందుకు ప్రభుత్వం సరఫరా చేస్తుందని రైతులు యూరియాకోసం ఎలాంటి ఆందోళన పడవలసిన అవసరం లేదని వారన్నారు.

## విద్యార్థికి రామానుజ సేవా ట్రస్టు ద్వారా ట్రైసైకిల్ అందజేసిన ఎమ్మెల్యే

**వెల్దుర్తి, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
వెల్దుర్తి మండలంలోని కుక్కునూరు ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి విద్యనభ్యసిస్తున్న జాతి శ్రావ్యకు నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చేతులమీదుగా రామానుజ సేవా ట్రస్టువారు ట్రైసైకిలు అందజేశారు. గురువారం హైదరాబాద్‌కు చెందిన రామానుజ సేవాట్రస్ట్ వారు ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా నరసపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని విద్యార్థికి ట్రైసైకిల్, అలాగే బ్యాటరీ సహాయంతో నడిచే సైకిల్ అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకోవాలని సంకల్పంతో ఉన్న విద్యార్థి పోలియో కారణంగా నడవలేని పరిస్థితిలో ఉన్నా తల్లిదండ్రులు ఆమెను రోజు పాఠశాలకు తీసుకురావడం జరుగుతుందని ఇది గమనించిన ఉపాధ్యాయులు స్పందించి రామానుజ సేవా ట్రస్ట్‌వారికి తెలపడం జరిగిందన్నారు. స్పందించిన ట్రస్ట్‌వారు విద్యార్థినికి ట్రైసైకిల్ అందించారని తెలిపారు. అదేస్కూల్లో గతంలో జరిగిన చిన్నప్రమాదం వల్ల మోచేతివరకు చేయి కోల్పోయిన వినయ్ అనే విద్యార్థికి ఎఐ టెక్నాలజీతో రూపొందించిన కృత్రిమహ్యాండ్ అమర్చడం జరిగింది. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు రామానుజ సేవా ట్రస్ట్‌వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్‌గౌడ్, మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతను కేంద్రంపై నెట్టడం సరికాదు

**-యూరియా కేటాయింపుల్లో రాష్ట్రాన్ని కేంద్రం తక్కువ చేయలేదు**
**-బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌యాదవ్

**గజ్వేల్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):**
రైతులకు యూరియా ఇవ్వడంలేదని కేంద్రంపై అసత్య ప్రచారం చేయడం సరైందికాదని, రాష్ట్రంలో 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం సరైన నివేదికను ఎందుకు ఇవ్వడంలేదని బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ ప్రశ్నించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ ప్రభుత్వమని, రాష్ట్రంలో యూరియా ఎక్కడ కొరత లేదని, కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని బదనాంచేసే పనిలో ఉందని విమర్శించారు. ప్రభుత్వం వద్ద 2.4 లక్షల టన్నులు ఖరీఫ్ సీజన్‌కు ఓపెనింగ్ స్టాక్ ఉందని, ఆగస్టు 2025 వరకు కావాల్సిన 8.30 లక్షల మెట్రిక్ టన్నులలో ఇప్పటి వరకు 5.18 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం సరఫరా చేసిందని, తెలంగాణలో ఈరోజు వరకు మొత్తం అందుబాటులో ఉన్న యూరియా 7.22 లక్షల మెట్రిక్ టన్నులు అని తెలిపారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్టాక్ లేదని అబద్ధాలు చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. రైతులను భయభ్రాంతులకు గురిచేసి నో-స్టాక్ బోర్డులు పెట్టడంతో ఒక్కసారిగా యూరియా కోసం షాపుల వద్దకు చేరుకొని ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దళారులు బ్లాక్ మార్కెట్ కొనుగోలు చేయడం వల్ల రాష్ట్రంలో కృత్రిమ కొరత ఏర్పడిందని, ప్రపంచ సమస్యలు అనేకం పీడిస్తున్నా, ప్రజలపై దాని ప్రభావం పడకుండా ప్రధాని నరేంద్రమోడి ఏలోటు చేయకుండా సేవలు అందిస్తున్నారని తెలిపారు. అందుకే దేశ ప్రజల్లో ఆయనపై ఉన్న అభిమానంతో మూడోసారి ప్రధానమంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా కేంద్రంపై విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెప్యాల వెంకట్‌రెడ్డి, మున్సిపల్ బిజెపి ప్రధాన కార్యదర్శులు మాద్దూరి నరసింహ, నాయిని సందీప్‌కుమార్, ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి ప్రసాద్, బిజెపి సీనియర్ నాయకులు నాగుముదిరాజ్, కల్లా సాయికుమార్, గడియారం రాజేశ్వర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన వేదశ్రీకి ఘనసన్మానం

**రామాయంపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
84వ స్నాతకోత్సవంలో పిహెచ్‌డి సాధించినందుకు జిల్లాపరిషత్ రామాయంపేట బాలుర ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ వేదశ్రీని హెచ్‌ఎమ్ నాగమణి, ఎ.రమేష్, ప్రసాద్, గోపాల్, ఆశయ్య, హేమలత, నాగలక్ష్మి, సిద్ధిరాములు సిబ్బంది అందరు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతశిఖరాలు అధిరోహించిన డాక్టర్ వేదశ్రీ ఎంతో ప్రేరణదాయకం అని, ఈపాఠశాలలో విధులు నిర్వహించడం పిల్లలకు స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు.

## వెళ్లకపోతే తిరుగుబాటే

**జిల్లేడు చౌదరిగూడెం, ఆగస్టు, 21, ప్రభాతవార్త:**
మార్వాడీలు తమ మండలాన్ని వదిలి వెల్లకపోతే తిరుగుబాటు చేసి వెళ్లగొడతామని బిసిసేన మండల అధ్యక్షుడు బోయ చెన్నయ్య అన్నారు. బతుకుదెరువు కోసం అని వచ్చి ప్రజలను దోచుకునే స్థితికి వచ్చారని అన్నారు. మార్వాడి గోబ్యాక్ నినాదాన్ని ప్రతి ఒక్కరు పాటించి మార్వాడీలు వెళ్లిపోయేంతవరకు పోరాటం చేయాలని అన్నారు. మార్వాడీలు తమ మండలాన్ని వదిలి వెళ్లకపోతే బిసిసేన ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

## బందును విజయవంతం చేయండి

**కొందుర్గు, అగస్టు, 21, ప్రభాతవార్త:**
రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల దోపిడీ దౌర్జన్యాలను అరికట్టాలనే ఉద్యేశ్యంతో ఉస్మానియ జెఏసి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నాడు బందులో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక వ్యాపారసంఘం నాయకులు గురువారం ఒకప్రకటనలో కోరారు. వ్యాపారులు పలు దుకాణాలకు వెళ్లి బందును విజయవంతం చేయాలని కోరారు.

### గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్సై శైలజ

**కోట్‌పల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త;**
గణేష్ మండపాలకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని ఎస్సై శైలజ అన్నారు. గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. మండలంలో గ్రామాలలో ఉత్సవాల సమయంలో కొన్ని జాగ్రతలు పాటించాలన్నారు. ముఖ్యంగా మండపాల ఏర్పాటుకు పోలీసుల నుండి అనుమతి తీసుకోవడం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ప్రధాన రహదారిలో గణేష్ మండపాలు నిర్వహిస్తే కనీసం టూవీలర్ వెళ్లేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద విద్యుత్తు కనెక్షన్లు కోసం విద్యుత్తు అధికారుల పర్మిషన్ కుడా తప్పని సరిగా తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద ప్రత్యేకంగా డిజెలకు అనుమతి లేదన్నారు. గణేష్ మండపాల ఏర్పాటు కోసం పోలీస్‌శాఖ అనుమతికోసం ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవాలని పేర్కొన్నారు.

## పనుల జాతరను విజయవంతం చేయండి

**జిల్లేడు చౌదరిగూడెం, అగస్టు, 21, ప్రభాతవార్త:**
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార నిర్వహిస్తున్న పనుల జాతర 2025కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## విజయవంతంగా భారతకమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు

**మొయినాబాద్, అగస్టు 21, ప్రభాతవార్త:**
భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాల్గోవ మహసభలు మేడ్చల్ జిల్లాఓని గాజుల రామారంలో ఘణంగా జరుగు తున్నాయని మొయినాబాద్ మండల సిపిం పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామాస్వామి అన్నారు, రాష్ట్ర నాల్గోవ మహసభల్లో భవిష్యత్తు కార్యాచరణ పైన నిర్ణయాలు తీసుకుంటారని పార్టీ అభివృద్ధి కోసం ప్రజా సంఘాల నిర్మాణం కోసం ప్రజాసమస్యలపైన పోరాటంకోసం ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లస్థలాల కోసం భూపోరాటంపై కార్యాచరణ ఉంటుందని ఈ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యావర్గ సభ్యులు వడ్ల సత్యానారాయణ, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, ఎన్ఎఫ్ఐడబ్లూ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వడ్ల మంజుల, మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, చేవెళ్ల మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-డాక్టర్. రాజ్‌కుమార్**

**నందిగామ, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ తమపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తం కావాలని జిమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వి.రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నందిగామ మండలం నర్సప్పగూడ గోవిందు పోచయ్య కాలనీలో ముచింతల్ జిమ్స్ మెడికల్ కాలేజ్, ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం వ్యాధులు ఈగలు దోమల ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ అనారోగ్యం, పోషకాహార రుగ్మతలపై వివరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ విష్ణుబాంధవి, డాక్టర్ సుష్మ, ఇంటర్న్ పూజ, ఇంటర్న్ శివాని మరియు ఎమ్మెస్ డబ్ల్యూ సన్యాసి నాయుడు, సోషల్ వర్కర్ దినేష్ కుమార్ చౌబె తదితరులున్నారు.

## రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?

**-చినుకు పడితే రోడ్డు చిత్తడి చిత్తడి**
**-పట్టించుకునే వారే లేరంటున్న గ్రామస్థులు**

**నందిగామ, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
నందిగామ మండలకేంద్రం నుండి రంగాపూర్, మేకగూడవెళ్లే అంతర్గత రహదారి చినుకు పడితే చిత్తడిచిత్తడిగా మారి వాహనదారులకు ఇబ్బందిగా పరిణమించింది. రోడ్డంతానీళ్లతో అడుగుకోమడుగు తలపిస్తూ ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ఇలా ఉంటే.. ప్రయాణం ఎలా చేయాలని గ్రామస్తులు, కార్మికులు, విద్యార్థులు, రైతులు ప్రశ్నిస్తున్నారు. మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని అధికారులను కోరుతున్నారు.

## విత్తన గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

**తాండూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త :**
విత్తన గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని బిసి కమిషన్ మాజీసభ్యులు శుభప్రద్‌పటేల్ అన్నారు. గురువారం తాండూరులోని తన కార్యాలయంలో విత్తన గణపతి విగ్రహాలను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రీక విజయలక్ష్మి, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షురాలు తాటికొండ స్వప్న, ట్రస్ట్ చైర్‌పర్సన్ శివానితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్ హరితసేన వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన పర్యావరణ పరిరక్షణకోసం విత్తన గణపతిని పంపిణీచేయడం జరిగిందని తెలిపారు. విత్తనగణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల నిర్వాహకులు, వివిధసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా సమస్యలను పరిష్కరించాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లా సమస్యలను పరిష్కరించే దిశగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డిలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిత్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ప్రతిపాదించడం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యాపరంగా, జిల్లా వె నుకబడి ఉందని, జిల్లా ఆస్పత్రి ఉన్నప్పటికీ సౌకర్యాలు కొరతతో ప్రజలు అ నునిత్యం వైద్యం కోసం హైదరాబాద్, గుల్బర్గా వెళ్లవలసి వస్తుందని అన్నారు. చాలా జిల్లాల్లో ఇటువంటి పరిస్థితులే ఉండవచ్చని, కావున అన్ని వసతులతో జిల్లా ఆస్పత్రుల అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం కావున సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం పై వత్తిడి తేవాలని, మన ప్రాంతంలో ఉన్న సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరంకాకుండా చూడాలని, సిమెంటు, సుద్ధ ఫ్యాక్టరీల్లో, నాపరాతి గ నుల్లో, పాలిషింగ్ యూనిట్లలో, కొన్నివేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నప్పటికీ నేటికీ ఇక్కడ ఈఎస్ఐ ఆసుపత్రి లేదని. మంజూరు అయిందని చెప్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని వెంటనే ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## కన్నుల పండువగా కాకునూర్‌లో అమ్మవార్ల బోనాలు

**కేశంపేట ఆగస్టు 21 ప్రభాతవార్త**
ఆషాఢమాసం ఆఖరిలో అమ్మవార్లకు బోనాలను సమర్పించడం మన హిందూ సంప్రదాయం. మన సాంప్రదాయంలో భాగంగా గురువారం కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో ఈదమ్మ, కోట మైసమ్మ, పోచమ్మ బోనాలను గ్రామస్తులు అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎక్కడ చూసిన పిల్లాపాపలతో ఆడపడు చులతో కన్నులపండుగగా కనిపించింది. సాయంత్రం సంధ్య వేళలో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకునేందుకు ఆడపడుచులు బోనాలను అలంకరించి నెత్తిపై ఎత్తుకొని అమ్మవార్ల నామస్మరణ స్మరించుకుంటూ సన్నాయి మేళలతో డప్పువాయిద్యాలతో డిజెచప్పుళ్లతో తొట్టెలను అలంకరించుకొని నృత్యాలుచేసుకుంటూ అమ్మవార్ల ఆలయాలకుచేరుకున్నారు. అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి బండారు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు చిన్నారులు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఉపాధి హామీ పనుల జాతర

**మంచాల, ఆగస్టు 22,ప్రభాతవార్త :**
ఉపాధి హామీ 2025 పనుల జాతర నేటి నుండి ప్రారంభం కానుంది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలములోని అన్ని గ్రామపంచాయతీలలో నేటి నుండి ఉపాధిహామీ, స్వచ్ఛభారత్, వాటర్‌షెడ్, పిఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల క్రింద పూర్తి అయిన పనులకు ప్రారంభోత్సవము, నూతనపనులకు భూమిపూజ చేయనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీనందు గ్రామసభ ఏర్పాటుచేసి పథకం లక్ష్యాలను, ముఖ్య ఉద్దేశాలను గ్రామసభనందు తెలిపి రైతులకు పథకంద్వారా లబ్ది చేకూర్చబడును అని మంచాల మండల ప్రజాపరిషత్ అధికారి అన్నారం బాలశంకర్ అన్నారు.

### వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలి : ఎస్ఐ

**పూడూరు,ఆగస్టు 21 ప్రభాతవార్త:**
వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో ప్రతిష్ఠించే వినాయక మండపాలకు అనుమతులు తప్పకుండా తీసుకోవాలని ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి గురువారం ఒకప్రకటనలో తెలి పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజెలకు అనుమతులు లేవని, మండపాలలో విద్యుత్తుసౌకర్యం కోసం సంబంధిత అధికారులతో అనుమతులు తీసుకోవాలన్నారు.



అమ్మవార్లకు బోనాలు తీసుకెళ్తున్న దృశ్యం

## ఘనంగా బోనాల పండుగ

**చేర్యాల, ఆగస్టు 21, ప్రభాతవార్త :** పట్టణంలోని ముదిరాజుల కులదైవమైన పెద్దమ్మ, పోచమ్మ దేవతలకు గురువారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. పట్టణంలోని ముదిరాజ్ కులస్తులు తమ ఆరాధ్యదైవమైన పెద్దమ్మ, పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుల చప్పుళ్లు, శివ సత్తుల శిగాలు, పోతరాజుల విన్యాసాలతో బోనాలు భారీ ఊరేగింపుగా ఆలయాలకు తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## 'ఇందిరమ్మ ఇళ్లు' పేదల జీవితాల్లో వెలుగులు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు పరుస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో ఎంతోమంది పేదవారి సొంతింటి కల నెరవేరడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ అన్నారు. గురువారం దాచారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు బామండ్ల బాలవ్వ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మొదటి విడత పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి గృహప్రవేశం చేస్తూ వారికి నూతన వస్త్రాలతో పాటు రూ.10 వేల విలువగల బహుమతిని అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్‌రెడ్డి, బిసి సెల్ అధ్యక్షుడు గుండెల్లి శ్రీకాంత్, నాయకులు బైరా సంతోష్, బోడిగె రామచంద్రం, పెంటమీది వెంకన్న, న్యాలం రాజేశం పాల్గొన్నారు.

## పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగి హక్కు...

-పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, కుమార్




మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పిఆర్‌టియు నాయకులు

**మర్కుక్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** ప్రతి ఉద్యోగికి పెన్షన్ ఒక హక్కు అని, ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేబల్లి శ్రీనివాసరావు, తుమ్మ కుమార్ అన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఛలో ఇందిరాపార్కు పిఆర్‌టియు మహా ధర్నా పోస్టర్‌ను గురువారం పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొత్త నరేందర్‌రెడ్డి, కూచిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నర్సింలు, షాబుద్దీన్, రాష్ట్ర మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు రజిత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, గణేష్, శ్రీధర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సరితాదేవి, నాయకులు రమణారావు, వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మారెడ్డి నాగేశ్వరరావు, సిద్ధయ్య, కృష్ణ, బుచ్చయ్యస్వామి, భూజాత, వందన, ఫౌజియా, మాధవి, హేమలత, ఉమారాణి, స్వాతి, శైలజ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌లో ఎన్‌సిసి సబ్ యూనిట్ ప్రారంభం



కళాశాలలో ఎన్‌సిసి సబ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లో గురువారం ఎన్‌సిసి సబ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిహెచ్‌వి.కృష్ణారావు, ఎన్‌సిసి సిఓ రమేష్ సిరియల్ మాట్లాడుతూ ఎన్‌సిసి అనేది విద్యార్థులకు సైనిక శిక్షణ, క్రమశిక్షణను అందించే ఒక సంస్థ అన్నారు. విద్యార్థులలో దేశభక్తి మరియు క్రమశిక్షణను పెంపొందించడం, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం, సామాజిక సేవ మరియు సమాజ అభివృద్ధికి తోడ్పడుతుంద న్నారు. ఎన్‌సిసి యూనిట్ ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుండి అధికారిక అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. యూనిట్ కోసం తగిన భవనం, శిక్షణకు అవసరమైన పరికరాలు, ఇతర వనరులు సమకూర్చినట్లు తెలిపారు. ఎన్‌సిసి కమాండింగ్ అధికారులు 37 మంది విద్యార్థులను ఎన్‌సిసి శిక్షణ నిమిత్తం ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖాదిపతులు బి.వేణు, ఆర్.సారంగపాణి, ఎల్‌టి సుందర్‌లాల్, ఏఓ నరేందర్, ఓఎస్ స్వామి, పిడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## డిస్టిలరీ పరిశ్రమపై చర్యలు తీసుకోండి

**చౌటకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రం శివారులోని గణపతి చక్కర పరిశ్రమ డిస్టిలరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గురువారం తహసీల్దార్ అనుదీప్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరద జలాలతోకలిపి వ్యర్థజలాలను చెరువు, కుంటలు, పంట పొలాల్లోకి వదులుతున్నారని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. గణపతి చక్కెర కర్మాగారం నుంచి మొలాసిస్‌ను తీసుకువచ్చి మద్యం, లిక్కర్ తయారీకి వినియోగించే స్పిరిట్‌ను తయారు చేస్తున్నారని, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున మోలాసిస్ వ్యర్థ జలాలను సైతం వదులుతున్నారని తెలిపారు. యాజమాన్యాంపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

# ఎస్సీ కులాల, పారిశుధ్య కార్మికుల ఆత్మీయ సమావేశం

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** సామాజిక సమరసత వేదిక గజ్వేల్ ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ కులాలు, పారిశుధ్య కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని శ్రీలక్ష్మీ శ్రీనివాస నర్సింగ్ హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సామాజిక సమరసతావేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు అధ్యక్షత వహించగా అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో 4 కులాలకు చెందిన 35 మంది పాల్గొనగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మనం ఎస్సీలం, సోదరులం అనే భావనతో కలిసిమెలిసి ఉండాలన్నారు. భారత రాజ్యాంగం మేరకు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో 59 కులాలు ఉన్నాయని, ప్రతి కులానికి ఒక కుల దేవత, చరిత్ర ఉందన్నారు. 75 సంవత్సరాల రాజ్యాంగం అమలులో అభివృద్ధి ఫలాలు అన్ని ఎస్సీ కులాలకు సమంగా చేరలేదని, దీనికి అనేక కారణాలు ఉన్నాయని, ఎస్సీలకు చెందిన అన్ని కులాలవారు ప్రగతి కోసం కలిసిమెలిసి పని చేయాలని అన్నారు. రాజకీయాలు అవసరమే కానీ రాజకీయాలు మాత్రమే అనుసరిస్తే అవి ప్రజలను విడదీస్తాయని, ధర్మ, సంస్కృతులు మాత్రమే ప్రజలను సమైక్యం చేస్తాయని తెలిపారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ మన అందరి మధ్య మరింతగా సద్భావం, సోదర భావం పెరగడానికి మనం ఏమేమి చేయగలమో అభిప్రాయాలను తెలపాలని చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తెలిపారు. డాక్టర్ ఆకుల నరేష్‌బాబు మాట్లాడుతూ మనం ఎస్సీలం మాత్రమే కాదు హిందువులం అని,మనమంతా కులాలకు, వర్గాలకు అతీతంగా భారతీయులం అనే భావనతో ఐక్యంగా ఉండి మన దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలుపుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, మంజుల, డాక్టర్ మంద సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామాజిక సమరసతా వేదిక అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న తెలంగాణ చాకో జహీరాబాద్ అధ్యక్షుడు రాములు నేత

## కులవృత్తుల వారికి నష్టం జరిగితే ఊరుకోం

-తెలంగాణ జాగో వ్యవస్థాపక అధ్యక్షుడు రాములు నేత

**జహీరాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** స్థానికంగా తెలంగాణ వ్యాపారులు, కులవృత్తుల వారికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తూ ఇక్కడి వ్యాపారులకు తీవ్ర నష్టం జరిగినట్లు, వారి పట్ల ఊరుకునే ప్రసక్తే లేదని, వారికి వ్యతిరేకంగా స్థానిక వ్యాపారులు కులవృత్తులతో కలిసి పోరాటం చేస్తామని తెలంగాణ జాగో జహీరాబాద్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ రాములు నేత అన్నారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి మార్వాడి వ్యాపారస్థులు జహీరాబాద్ ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహిస్తూ స్థానిక వ్యాపారులకు యువతకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్కువ ధరకు నాసిరకం వస్తువులను అమ్మి ఇక్కడ ప్రజలను మోసం చేస్తూ ఆర్థికంగా పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించి తమ రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడుతున్నారి విమర్శించారరు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఐతం ఇతర రాష్ట్రాల నుంచి తక్కువకు కార్మికులను పనిలోకి తీసుకుని ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 22న పట్టణంలోని స్థానిక వ్యాపారస్తులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో తెలంగాణ జాగో నాయకులు ఎండి ఇమ్రాన్, మాదినం, శివప్రసాద్ ప్యార్ల, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి

ఎస్ఐ కీర్తి రాజ్

**దుబ్బాక, ఆగష్టు 21, ప్రభాతవార్త :** వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవడానికి కుల, మతాలకతీతంగా ప్రజలు సహకరించాలని ఎస్ఐ కీర్తిరాజ్ కోరారు. దుబ్బాక పట్టణంలో ఏర్పాటు చేసిన శాంతి పరిరక్షణ కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. వినాయక మండపాలను ఏర్పాటు చేసినట్లయితే కచ్చితంగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వినాయక మండపాల వద్ద డిజె సౌండ్ ఏర్పాటు చేయొద్దని హెచ్చరించారు. విద్యుత్ శాఖ అధికారుల సూచనల మేరకు మండపాలకు విద్యుత్ సరఫరా పొందాలన్నారు.అవసరమైతే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద కచ్చితంగా సభ్యుల పర్యవేక్షణ ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో అధిక సౌండ్ పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, విద్యుత్ ఏఈ కనకరాజు, అగ్నిమాపక అధికారి లక్ష్మణ్, వివిధ గ్రామాల యువకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో భవాని మాత దీక్షలు చేపట్టాలి

సంగ్రామ్ మహారాజ్

**నారాయణఖేడ్, ఆగస్టు 21 ప్రభాతవార్త :** భక్తిశ్రద్ధలతో దీక్షలు చేపట్టాలని కొండాపూర్ ఆశ్రమపిఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ అన్నారు. నారాయణఖేడ్ మండల కేంద్రంలో కొండాపూర్ ఆశ్రమంలో అఖిల్ భారతీయ సాధుసంత్ ప్రతినిధి పూజ శ్రీ సంగ్రామ్ మహారాజ్ చేతుల మీదుగా శ్రీ జగదాంబ భవాని మాత 41 రోజుల మండల దీక్షలు వేసుకోవడం జరిగింది. సంగ్రామ్ మహారాజ్ మాట్లాడుతూ ప్రతి గిరిజన తండాలలో బంజారాల ఆరాధ్య దైవమైనటువంటి జగదాంబ భవాని మాత సేవాలాల్ మహారాజ్‌కి భోగ్ భండార్ నిర్వహించి ప్రతి తాండాలలో ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో మద్యపానానికి ధూమపానానికి మాంసహారానికి దూరంగా ఉంటూ పూర్తిగా శాకాహారము స్వీకరించి భక్తితో ఉండాలని ప్రతి తండాలలో సాయంత్రం పూట భజన నిర్వహించాలని తెలిపారు అదేవిధంగా 21 రోజుల దీక్షలు 11 రోజుల దీక్షలు తొమ్మిది రోజుల దీక్షలు ప్రతి ఒక్కరూ ప్రతి తాండాలో వేసుకొని మీ కుటుంబానికి భక్తి మార్గంలో తీసుకువెళ్లాలని మీ పిల్లలని ప్రయోజకులుగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజు నాయక్, లక్ష్మణ్ చౌహాన్, మోహన్ నాయక్, ప్రేమ్ సింగ్ సుభాష్ జాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగ్రామ్ మహరాజ్



చెరువును పరిశీలిస్తున్న దృశ్యం

## చేప పిల్లల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**బెజ్జంకి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లకు ఉచితంగా అందించే చేప పిల్లల పంపిణీలో సర్కారు పూర్తిగా విఫలమైందని ముదిరాజ్ హక్కుల పోరాట సమితి నాయకులు రావుల రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో గల ఊర చెరువును స్థానిక ముదిరాజ్ నాయకులతో కలిసి పరిశీలించారు. 2016లో బిఆర్ఎస్ సర్కారు ముదిరాజ్‌లను ఆర్థికంగా అదుకోవాలనే సంకల్పంతో ఉచిత చేప పిల్లల పంపణీ పథకం ప్రారంభించిందన్నారు. ప్రతి యేటా బిఆర్ఎస్ సర్కారు హయాంలో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేశారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు యేండ్లు కావాస్తున్న ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయాలని లేదంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రావుల కనకయ్య, సంఘం నాయకులు కొరివి తిరుపతి, కొరివి కొమురయ్య, రాజేందర్, రమేష్, రాజేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయానికి సిబ్బంది కేటాయింపు

**చౌటకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త:** తహసీల్దార్ కార్యాలయానికి రెగ్యులర్ సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన కమీషనర్ భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి ఉత్వర్వులు జారీచేశారు. 2020 జులైలో 13 రెవిన్యూ గ్రామాలతో కలిపి చౌటకూరును మండల కేంద్రంగా ప్రకటించిన విషయం పాఠకులకు విధితమే. మండలానికి 13 మంది సిబ్బందిలో తహసీల్దార్, నయాబ్ తహసీల్దార్ , ఎంఆర్ఐలు-2, సీనియం, ఏఎస్వీ, ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్-3, చైన్మెన్ పోస్టులను మంజూరు చేసినట్లు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్‌పై డిఇవో కు ఫిర్యాదు

**హత్నూర ఆగస్టు 21, ప్రభతవార్త:** అధిక ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఇబ్బందుల గురిచేస్తున్న హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామం లోని అభిజ్ఞ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం సంగారెడ్డి జిల్లా విద్యాధికారి ఫిర్యాదు చేసినట్లు పత్నూర మండలం నవ పేట గ్రామానికి చెందిన సిహెచ్ ఎల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. టీసీలు కావాలంటే అదనంగా రుసుము వసూలు చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులతో బాధ్యత రహితంగా మాట్లాడుతూ అవమానపరుస్తున్నారని తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

## రోడ్డు బాగుచేయాలి : బిజెపి

**హత్నూర, ఆగస్టు 21, ప్రభతవార్త:** మండలం పరిధిలోని షెర్ఖాన్‌పల్లి కొండాపూర్ రొయ్యపల్లి కాగజ్ మద్దూరు రోడ్డు బాగుచేయాలని డిమాండ్‌చేస్తూ గురువారం హత్నూర ఎంపిడిఓ శంకర్ కు భారతీయ జనతా పార్టీ హత్నూర మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబీసీ మోర్చ రాష్ట ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రోడ్లు పూర్తి అస్తవ్యస్తంగా అయ్యాయని ఆర్టీసీ బస్సులు తిరగడం కూడా కష్టంగా మారడంతో ప్రజలు విద్యార్థులు అవస్తపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసాని సురేష్, అసెంబ్లీ కో కన్వీనర్ ఎర్ర సతీష్ శ్రీశైలం బీజేపీ నాయకులు కుమార్ మల్లేష్ పాండు ప్రవీణ్‌గౌడ్ శివ రామాగౌడ్ సాయిబాబా అనిల్ మహేష్ సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హత్నూర ఎంపీడీవో కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

# రైతులకు యూరియా అందించండి

**బిఆర్ఎస్ నేత సోలిపేట సతీష్ రెడ్డి**

**దుబ్బాక, ఆగస్టు 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రైతులకు సకాలంలో ఎరువులు అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే రైతులకు సరిపడేంతగా యూరియాని అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీష్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం దుబ్బాక పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో వారు మాట్లాడారు. రైతుల సమస్యల్ని పక్కనపెట్టి ఓట్లు, సీట్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో రైతులను కడుపున పెట్టుకొని చూసుకున్నామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గోస పెడుతుందని మండిపడ్డారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఏనాడైనా ఆయన ప్రజల్లో తిరిగితే వారి కష్టసుఖాలు తెలిసేవన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ ప్రాంత రైతులకు సరిపడేంత యూరియాని అందించి రైతుల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నె భూమిరెడ్డి, పల్లె రామస్వామి గౌడ్, బండి రాజు, ఇస్తారీ గల్ల స్వామి, ఆస స్వామి, శ్రీనివాస్, దేవుని రాజు, పర్స కృష్ణ, పలువురున్నారు.



మాట్లాడుతూన్న సోలిపేట సతీష్‌రెడ్డి



ఆందోళన చేస్తున్న రైతులు

## యూరియా కోసం రైతుల ఆందోళన

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో గురువారం యూరియాకోసం రైతులు రోడ్డుపై బైటాయించి ఆందోళనకు దిగారు. ముస్తాబాద్-సిద్దిపేట రహదారిపై రైతులు ఆందోళనకు దిగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. కొద్ది రోజుల నుంచి యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరత తీర్చే వరకు ఆందోళన విరమించే ప్రసక్తిలేదని మొండికేశారు. రైతులకు బిఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. పోలీసులు కలగజేసుకుని రైతులను శాంతిపజేశారు.

## మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు : ఎస్ఐ

**కొమురవెల్లి, ఆగస్టు 21,ప్రభాతవార్త :** మండల పరిధిలోని గురవన్నపేట గ్రామ స్కూల్ విద్యార్థులకు గురువారం ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌కు ఆహ్వానించి ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీస్ ఫంక్షన్‌పై అవగాహన కల్పించారు. దరఖాస్తు స్వీకరణ, ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తు విధానం, ఛార్జిషీట్‌లను తెలియజేశారు. అలాగే స్టేషన్ రికార్డ్సు, సిసి కెమెరాలు, విహెచ్ఎఫ్ సెట్, స్టేషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. డయల్ 100 కాల్ చేస్తే పోలీసులు స్పందించే తీరును వివరించారు. సిసి కెమెరాల ద్వారా ఎంతో ఉపయోగం ఉందని. గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లొదన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు కలిగి ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేదిలేదు : ఎస్ఐ

**మర్కుక్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేదిలేదని ఎస్ఐ దామోదర్ తెలిపారు. గురువారం మర్కుక్ పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని 16 గ్రామాల వినాయక మండపాల నిర్వహణ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపం ఏర్పాటు చేయడానికి పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని, ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండపం ఏర్పాటు చేసే స్థలంలో విద్యుత్ తీగలు, ట్రాఫిక్ ఇబ్బంది ఉన్నట్లయితే మండపాలను ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. భగవంతున్ని భక్తితో పూజిస్తే చాలని, ఎత్తైన విగ్రహం పెట్టుకున్నామన్నది ముఖ్యం కాదని, గణపతి పండుగను భక్తిశ్రద్ధలతో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి విద్యార్థినిలకు బ్లాంకెట్‌ల పంపిణీ

**మర్కుక్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు గురువారం శ్రీకర ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, ఐడిఏ బొల్లారం వారి సౌజన్యంతో కంపెనీలో విధులు నిర్వహిస్తున్న చేతిరెడ్డి శ్యామ్‌రెడ్డి, ఆర్ఎండి మేనేజర్ గౌర వెంకట్ సహకారంతో ఉపాధ్యాయులు చేతిరెడ్డి భూపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి చొరవతో 220 మంది విద్యార్థినిలకు రూ.80వేల విలువైన బ్లాంకెట్‌లను మండల విద్యాధికారి వెంకటరాములు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పేద విద్యార్థులకు బ్లాంకెట్‌లను అందజేసిన, సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు హరిబాబు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీలో భాగంగా గురువారం తాజా మాజీ కౌన్సిలర్ ఉప్పల పద్మ మెట్టయ్య వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా అల్పాహారంతో పాటు అరటిపండ్లు, బ్రెడ్, పంపిణీ చేయడం జరిగింది. అలాగే 20 మందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా, లయన్ పరమేశ్వరచారి, లయన్ మల్లేశంగౌడ్, లయన్ కుమార స్వామిలు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం ప్రభుత్వాసుపత్రి వద్ద అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతి శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, గుడాల రాధాకృష్ణ, రాజారాం, దొంతుల సత్యనారాయణ, తాటి రాములు, సయ్యద్ మతీన్, శ్రీధర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివాలయ 15వ వార్షిక మహోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

**సదాశివపేట, ఆగస్టు 21(ప్రభాతవార్త):** పట్టణంలోని కోహీర్ గౌనిలోని శ్రీశివాలయం 15వ వార్షిక మహోత్సవంలో భాగంగా ఉదయం స్వామివారి సుప్రభాత సేవ తదుపరి మహాగణపతి మహాగౌరీ స్వస్తి పుణ్యాహవాచనం ఆవాహిత మంటపదేవత, రుద్ర స్వాకార హవనం, రుద్రాభిషేకం తదుపరి ఈ సంవత్సరం ప్రప్రథమంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. దేవాలయం నిర్మించి 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో ఈ సంవత్సరం విశేషంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని ఆదిదంపతుల ఆశీస్సులు పొంది మహా ప్రసాదం స్వీకరించారు.

## మునిపల్లిలో రేషన్ డీలర్ల సమావేశం

**మునిపల్లి, ఆగస్టు 21(ప్రభాతవార్త):** మునిపల్లి మండలం సంబంధించి డిప్యూటీ తాసిల్దార్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లతో గురువారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో కొత్తగా మండలానికి మంజూరైన 2112(యూనిట్లు)రేషన్ కార్డులకు సంబంధించి, ఆథరేషన్ రెన్యువల్, రేషన్ డీలర్లు బియ్యం పంపిణీలో పాటించవలసిన సమయపాలన, మొదలగు అంశాలపై చర్చించడం జరిగింది.ఈ సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు నాగిశెట్టి, ప్రధాన కార్యదర్శి మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూతనిస్తాం

**మిరుదొడ్డి, ఆగస్టు 21, ప్రభాతవార్త :** సామాజిక సమరసత వేదిక సౌజన్యంతో చేతన గ్రామీణ వికాసనసేవ సమితి ఆధ్వర్యంలో మండల పరిధిలోని అందే గ్రామంలోని హైస్కూల్‌లో తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థులకు గురువారం ఉచిత బ్యాగులు, పుస్తకాలు,డిక్షనరీలు, పెన్నులు పంపిణీ చేశారు. చేతన గ్రామీణ వికాస్ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ విద్య ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు అన్నారు. మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. నిరుపేద విద్యార్థులకు చేతన గ్రామీణ వికాస్ సేవా సమితి ఎప్పుడు చేయూతనిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, చేతన గ్రామీణ వికాససేవా సమితి సభ్యులు సుకూరి పోచయ్య, గణపురం సంతోష్‌కుమార్, కదారి కనకరాజ్, దండబోయిన కనకరాజ్, మాట్ల పరశురాములు, శ్రీకాంత్, రాళ్లబండి సాయికుమార్, సుకూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## 29 నుంచి స్కూల్ గేమ్స్

**సిర్గాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

ఈనెల 29, 30వ తారీఖులలోస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు. 14,17 విభాగాలల కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ గేమ్స్ లను బాలబాలికలకు నిర్వహిస్తున్నామన్నారు. అండర్14లో పాల్గొనేవారు 1జనవరి 2012, అండర్17 వారు1 జనవరి 2009 తర్వాత పుట్టినవారు పోటీల్లో పాల్గొనేం దుకు అర్హులన్నారు. కార్యక్రమంలో పిడి సంతోష్, రమేష్, పిఈటి రాజేందర్, సుమలత, కవిత, లక్ష్మణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన రహదారి నిర్మించాలి...

**-ప్రయాణికుల ప్రమాదాలు పట్టించుకోని పాలకులు**
**-సిపి(ఐ)ఎం పార్టీ మండల కార్యదర్శి కె.రవీందర్**



తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

**గుమ్మడిదల, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ మండల పరిధిలోని కానుకుంట గుమ్మడిదల ప్రధాన రహదారి గుంతల మయమైన పాలకులు పట్టించుకోవడం లేదని సిపి(ఐ)ఎం పార్టీ మండల కార్యదర్శి కె.రవీందర్ ఆధ్వర్యంలో గురువారం కానుకుంట అంబేద్కర్ చౌరస్తా నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన చేపట్టి తహసీల్దార్ ఎం.పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కె.రవీందర్ మాట్లాడుతూ. గత రెండు మూడు సంవత్సరాల నుండి కానుకుంట గుమ్మడిదల ప్రధాన రహదారి గుంతలమయమై ప్రయాణికులకు ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నప్పటికీ ప్రస్తుత పాలకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి వెడల్పు నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి కానుకుంట గుమ్మడిదల ప్రధాన రహదారిని కేంద్ర ప్రభుత్వ నిధులు వెచ్చించి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. రోడ్డు గుంతలను పూడ్చి దానిపై రోడ్డు వెడల్పు పనులను చేపట్టాలన్నారు. పాలకులు స్పందించలేని పక్షాన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు శ్రీధర్‌రావు, బి. హుస్సేన్, బి.గోపాల్‌రెడ్డి, ప్రభు, మరిగాని యాదగిరి, మల్లన్నగారి రమేష్, దొంతుల వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌డిపిఎస్ చట్టంపై అవగాహన కలిగి వుండాలి



మాదకద్రవ్యాలపై విద్యార్థులచే నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ

**మునిపల్లి, అగస్టు 21, ప్రభాతవార్త:**

మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నషాముక్త్‌భారత్ అభియాన్ క్రింద మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై మునిపల్లి మండలం కంకోల్‌లోని వోక్సన్ యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమము నిర్వహించారు. ఈకార్యక్రమములో సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ సౌజన్య మాట్లాడుతూ ఎన్‌డిపిఎస్ చట్టంపై అవగాహన కలిగి వుండాలన్నారు. మాదకద్రవ్యాల సరఫరా ముఠాలు ప్రధానంగా విద్యార్థులనే లక్ష్యంగా చేస్తూ వారిని మాదకద్రవ్యాలకు అలవాటు చేసి వారి ద్వారానే మాదకద్రవ్యాల సరఫరా చేస్తున్నారన్నారు. విద్యార్థులు వాటికోసం నేరాలకు పాల్పడి తమ బంగారు భవిష్యత్తు నిర్వీర్యం చేసుకుంటున్నారని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించుటకై వివిధ శాఖల సమన్వయంతో తెలం గాణ ప్రభుత్వము మిషన్ పరివర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేసారు. ఎవరైనా మాదకద్రవ్యాలను సేవిస్తున్నా లేదా విక్రయిస్తున్నా నషా ముక్త్‌భారత్ అభియాన్ హెల్ప్‌లైన్ నెం.14446 ఫోన్‌ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా అధికారులు పోస్టర్స్ ఆవిష్కరించారు. విద్యార్థులచే నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. కార్యక్రమములో యూనివర్సిటీ డైరెక్టర్ శశికాంత్ ఉపాధ్యాయ, యూనివర్సిటీ డీన్ అన్నంనేని శ్రీలత, శ్రీధర్ డైరెక్టర్ అండ్ సెక్యూరిటీ, కంకోల్ మెడికల్ ఆఫీసర్ రాణి, ఎక్సైజ్ ప్రొహిబిషన్ సబ్‌ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్సై జగదీశ్వర్, మహిళా జిల్లా సాధికారత సమన్వయకర్త పల్లవి, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని వినతి



తహసీల్దారుకు వినతిపత్రం ఇసుతన్న బిజెపి నాయకులు

**కొల్చారం, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

రాష్ట్ర పార్టీ ఆదేశాలనుసారం గురువారం కొల్చారం మండలంలోని తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి మండలశాఖ తరపున మండలంలోని గ్రామ సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దానికి సానుకూలంగా తహసీల్దార్ శ్రీనివాస్‌చారి స్పందించారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో బిజెపి మండలశాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు జరిగినా వాళ్ళ పక్షాన పోరాడుతామని బిజెపి మండలశాఖ అధ్యక్షుడు ఘనపూర్ పంతులు హరీష్ తెలపడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పల్లె రవికాంత్, మండల ఉపాధ్యక్షుడు వంజరి ఎగొండ, మండల దళిత నాయకులు మోర్చా నాయకులు రాజుగారి కృష్ణ, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షులు పూల్‌సింగ్, బిజెపి మండల కోశాధికారి శివలాల్, శక్తికేంద్రం ఇంచార్జ్ శివప్రసాద్, కొంగోడు బూత్ అధ్యక్షులు సత్యనారాయణ, బిజెపి యువ నాయకులు వడ్ల భానుచందర్, సీతారాం తండా బూత్ అధ్యక్షుడు మలావత్ అంజా, బిజెపి నాయకులు గోపాల్, నరేష్, యాదగిరి, బిజెపి కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వంగదల్‌లో 110 ఎకరాల్లో పత్తి పంట నష్టం

**సిర్గాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వంగదల్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు 110 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్లు రైతులు పేర్కొన్నారు. స్థానిక వాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న భూముల్లో వరద నీరు నిలిచి నష్టం వాటిల్లినట్లు వాపోయారు. పత్తి వేర్లు కుళ్లిపోయి నష్టం జరిగిందని రైతులు పుండ్లిక్, మాధవరావు, శ్రీనివాసరావు, వామన్‌రావులు తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

# రసాయన ఎరువులకు ధీటుగా నానోయూరియా

**- నానోతో పర్యావరణ పరిరక్షణ - పోషక విలువల సామర్థ్యం ఎక్కువ - నేలకు, పంటకు మేలు - రైతుల్లో చైతన్యం రావాలి - రైతులు నానోయూరియా వైపు మొగ్గు చూపాలి - రైతులకు సంవత్సరానికి తగ్గట్టుగా జిల్లాలో యూరియా సరఫరా - జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**రామాయంపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

నానోయూరియాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలో రైతు ఆంజనేయులు నానోయూరియా వాడకాన్ని డిఏవో, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నానోయూరియా వాడకంవల్ల దిగుబడిలో అద్భుత ప్రయోజనాలు ఉన్నాయని, అత్యంత ప్రయోజనకారిణిగా ఉన్న నానోయూరియాని రైతులు వాడేవిధంగా చూడాలన్నారు. నానోయూరియా అనేది నానోటెక్నాలజీ సహాయంతో తయారు చేయబడిన ద్రవరూపంలో ఉండే ఎరువు. దీనిని వాడటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ మొత్తంలో వాడడం వల్ల ఇది మట్టి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. అధిక దిగుబడితో పాటు మెరుగైన పోషక విలువలతో కూడిన పంటలను పండించడానికి నానోయూరియా సహాయపడుతుందన్నారు. నానోయూరియా ద్రవరూపంలో ఉండటం వల్ల, రవాణా, నిల్వచేయడం సులభతరమన్నారు. క్షేత్ర



పంటలకు వాడే పురుగుమందును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

స్థాయిలో రైతులతో సమావేశం ఏర్పరచి.. నానో యూరియా వాడకంపైన విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పంటలకు రసాయన ఎరువులు వేస్తేనే దిగుబడులు వస్తాయన్న ఆలోచనలో రైతులు ఉన్నారని, పంట ఆరోగ్యం, నాణ్యమైన ఉత్పత్తికి పచ్చిరొట్ట, సేంద్రియ, జీవన ఎరువులు ఎలా ఉపయోగపడతాయో నానోయూరియా కూడా అంతేనని అధికారులు రైతులకు వివరించాలన్నారు. అనంతరం యూరియా సరఫరా గురించి మాట్లాడుతూ, ఇప్పటివరకు ఆగస్టు అవసరం మేరకు ఎరువుల సరఫరా చేయడం జరిగింది. ఎలాంటి ఎరువుల కొరత లేక పోయినా సెప్టెంబర్‌లో కొనుగోలు చెయ్యవలసిన రైతులు కూడా ఇపుడే కొనుగోలు చేయడం వల్ల ఎరువుల దుకాణాల వద్ద రద్దీ ఏర్పడుతుందని అన్నారు. జిల్లాలో రాబోవు 10 రోజుల్లో సుమారుగా 1000 నుండి 1500 మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులోకి రానున్నది. కావున రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. సెప్టెం బర్‌కి సరిపడా 4000 మెట్రిక్‌టన్నుల యూరియా సర ఫరాకు రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు హామీ ఇచ్చిన నేపథ్యంలో రైతులు ఎరువులు సెప్టెంబర్‌లోనే కొనుగోలు చేయాలని రైతులకు విజ్ఞప్తిచేశారు. రైతులు అవసరం మేరకు తగిన సమయంలో తగిన మోతాదులో మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని కృత్రిమ కొరత ఉందని వదంతులు నమ్మవద్దని, రైతుల అవసరానికి తగ్గట్టుగా, వ్యవసాయశాఖ దశలవారీగా ఎరువులు అందుబాటులో తప్పకుండా ఉంచుతోందని సమస్తరైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి దేవ్ కుమార్, మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ తోపాటు రైతులు పాల్గొన్నారు.

## యూరియా ఎరువుల పట్ల ఆందోళన చెందవద్దు

**-ఎంఎవో స్వప్నజాదేవ్**



సమావేశంలో ప్రసంగించిన తహసీల్దార్ క్రిష్ణయ్య, వ్యవసాయాధికారిణి స్వప్నజాదేవ్‌లు

**కౌడిపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా ఎరువుల పట్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, అవస రమైన యూరియాను సరిపడా అందజేస్తామని కౌడిపల్లి మండల వ్యవసాయాధికారిణి స్వప్నజా దేవ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కిష్టయ్య, ఎంఎవో స్వప్నజాదేవ్‌లు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 18,500 ఎకరాల్లో వరిపంట సాగు జరుగుతోందని, అందుకోసం 1624 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వారు చెప్పారు. కాని ఇప్పటి వరకు 1026 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు వారు వివరించారు. ఇప్పటివరకు అనగా ఆగస్టు మాసం అవసరం మేరకు ఎరువులు సరఫరా చేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఎలాంటి ఎరువుల కొరత లేకపోయినా సెప్టెంబర్‌లో కొనుగోలు చేయాల్సిన ఎరువులను రైతులు ఆగస్టులోనే కొనుగోలు చేయడం వల్ల ఎరువులదుకాణాలవద్ద రద్దీ ఏర్పడుతున్నట్లు వారు తెలిపారు. త్వరలోనే 600 మెట్రిక్‌టన్నులకుపైగా యూరియారానున్నదని, రైతులు ఎటువంటి ఇబ్బందిపడరాదని వారు సూచించారు. కార్యక్రమంలో వీరితోపాటు ఎఈవోలు సాహితి, స్రవంతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ప్రారంభమైన రైతుల కష్టాలు

**-బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**



సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో మాట్లాడుతున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

**గుమ్మడిదల, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

రైతులు కాళ్ల మొక్కే పరిస్థితి కాంగ్రెస్‌పాలనలోనే రావడం రాష్ట్రప్రభుత్వానికి సిగ్గుచేటని బిఆర్ఎస్ నేత చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో విలేకరులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పాలనలో రైతులకు అన్నివిధాలుగా అండగా నిలిచిందని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ దుర్మార్గ పాలనలో యూరియా కోసం రైతులు రోజులతరబడి లైన్‌లో నిలబడి కష్టపడాల్సి వస్తోంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీవర్షంలో చెప్పులను లైన్‌లో ఉంచి గంటల తరబడి నిలబడినా కూడా యూరియా అందక రైతులు బాధపడుతున్నారని ఆయన తెలిపారు. ఇలాంటి పరిస్థితి రావడం రాష్ట్రానికి సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు యూరియా అందించే ప్రత్యేక చర్యలు చేపట్టాలని, లేకుంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసనలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో దేవేందర్‌రెడ్డి, సదానందరెడ్డి, సత్యనారాయణ, సంజీవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, శివ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మండలంలో పనుల జాతర

**కంది, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఉపాధి హామీ పథకం ద్వారా ఈ నెల 22వ తారీఖు నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభం అవుతున్నాయని ఎంపిడిఓ పి.శ్రీనివాస్ తెలిపారు.

## కాలువ గండి పూడ్చండి

**-బిజెపి మండల అధ్యక్షులు అనిల్‌రెడ్డి**

**సిర్గాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

నల్లవాగు జలాశయం కుడి కాలువకు జెంలా తండా శివారులో పడిన గండిని పూడ్చడంలో నీటిపారుదలశాఖ అధికారులు విఫలమయ్యారని బిజెపి మండల అధ్యక్షులు మెన్నం అనిల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం గండిపడిన ప్రాంతాన్ని అనిల్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ జలాశయంనిండినా చివరి ఆయకట్టవరకు నీరు అందక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారనివాపోయారు. కాలువలను ఆధునీకరణ చేయడంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ విఫలం అయినట్లు తెలుస్తోందన్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి కాలువ గండి పూడ్చి వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు గుండు అనిల్, మండల ఉపాధ్యక్షులు కంట్రపల్లి చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 24న జోగిపేటకు మంద కృష్ణ రాక



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు

**పుల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

ఈనెల 24న వృద్ధుల, వికలాంగుల, వితంతువుల పెన్షన్‌ల పెంపుకై నిర్వహిస్తున్న సభకు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మైసగల్ల బుచేంద్ర పేర్కొన్నారు. మండల కేంద్రమైన పుల్‌కల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి బుచేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా పెట్టిన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని, పెన్షన్‌లు పెంచుతామని చెప్పి రెండేళ్లు గడుస్తున్నా ఆ పెన్షన్‌ల ఊసే ఎత్తడం లేదని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నమన్వయ కమిటీ సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, మాజీ జడ్పిటిసి సభ్యులు అర్జునయ్య, జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఏర్పుల కృష్ణ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బుచేంద్ర, కాకతీయ యూనివర్సిటీ నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, నాయకులు సంతోష్, ఎంఆర్‌పిఎస్ చౌటకూరు మండల అధ్యక్షులు ఎర్రోళ్ల రమేష్, జిల్లా కార్యదర్శి నల్లోల ప్రవీణ్, తుమ్మల యాదగిరి, విహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు ప్రశాంత్, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

## పనులజాతర విజయవంతం చేయాలి



ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన రివ్యూ సమావేశం

**కొండాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర భాగంగా నేటి నుండి చేపట్టదలచిన పనులజాతర కార్యక్రమానికి సంబంధించిన రివ్యూ సమావేశాన్ని మండల కేంద్రమైన ఎంపిడివో కార్యాలయంలో ఎం.సత్యయ్య అధ్యక్షతన గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎపివో వీరప్ప ఈసి గణపతి, టెక్నికల్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పనులజాతరకార్యక్రమాన్ని విధిగాప్రారంభించాలని, కార్యక్రమానికి సంబంధించి గ్రామంలో దప్పుచప్పుళ్లతో తెలిపి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నేటి కార్యక్రమంలో అంగన్‌వాడీసెంటర్ల నిర్మాణం, స్కూల్‌టాయిలెట్స్, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పశువులషెడ్ నిర్మాణాలు, ఇంకుడుగుంతలు, డంప్‌యార్డ్‌లపై అవగాహన కల్పించాలన్నారు.

# రోడ్డు ఎక్కుతున్న మెట్లు...!!

**-ఇరుకుగా మారుతున్న రహదారులు -ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**



రోడ్డుమీద వరకు వేసిన ర్యాంపు

**పెద్దశంకరంపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

ఎవరూ ఏమీ అనకపోతే రోడ్డుమీద కూడా ఇల్లు కట్టేలా ఉన్నారు పెద్దశంకరంపేటపట్టణంలో కొంత మంది. గజంజాగా అదనంగావచ్చే అవకాశం ఉంది అనుకుంటే అది రోడ్డు అయినా సరే ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. మరికొంతమంది అయితే అవకాశం ఉందికదా, ఎవరినుండి ఎలాంటి అభ్యంతరాలు వస్తలేవుకదా, అధికారులుకూడా ఏమీ అనట్లేదుకదా అనుకొని రోడ్డుమీదకు మెట్లు ఏర్పాటు చేసుకొని తన ఇంటిని పొడిగించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా రోడ్డు ఇరుకుగా మారుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు.

**ఇరుకుగా మారిన రోడ్లు...**

పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ నుంచి చావిడి వరకు ఉన్న రోడ్డు, అదేవిధంగా భగత్‌సింగ్‌విగ్రహంనుంచి భవానీమాత ఆలయకమాన్ వరకు ఉన్న రోడ్లు ప్రధానమైనవి. ఈరోడ్లకు ఇరువైపులా అక్కడక్కడ కొంతమంది రోడ్డుమీదివరకు మెట్లు నిర్మించుకోవడంతో రహదారులు ఇరుకుగామారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల అయితే ఒక వాహనం వస్తే ఇంకొక వాహనం వెళ్ళడానికి దారిలేనిపరిస్థితి నెలకొంది. అదేవిధంగా పట్టణంలోని సంగారెడ్డి, అకోలా రహదారి పైన కూడా ఇష్టారాజ్యంగా డబ్బాలు, షాపుల ముందర షెడ్లు వేస్తుండడంతో రహదారి ఇరుకుగా మారుతుంది. ఇలాంటి అక్రమనిర్మాణాలు గతంలో స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ ఓటుబ్యాంకు కోసం మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. పంచాయతీ అధికారుల అలసత్వం కూడా ఉన్నట్లు మరికొంతమంది చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ రహదారులు అభివృద్ధికి మార్గాలు. రహదారులు విశాలంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలుకూడా గుర్తుంచుకోవాలి. మెట్లు,ర్యాంపులు రహదారిమీదకు రాకుండా నిర్మాణాలు చేపడితే రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండక, రోడ్లు విశాలంగామారి అభివృద్ధికి ఆస్కారమేర్పడుతుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమాలు జరిగినట్లు రుజువైతే వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## బురదమయంగా మారిన రహదారి

**-ప్రయాణానికి తప్పని పాట్లు**



బురద, గుంతలతో నిండిన చౌటకూరు-పోచంపల్లికి వెళ్లే దారి

**చౌటకూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని రోడ్లు బురదమయంగా మారడంతో ప్రయాణానికి ప్రజలు, వాహన చోదకులు పాట్లు పడుతున్నారు. మండల కేంద్రమైన చౌటకూరు నుంచి పోచంపల్లి, బొమ్మారెడ్డిగూడెం, లక్ష్మీసాగర్‌లకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా, బురదలో కూరుకుపోవడంతో ప్రయాణించేందుకు ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. రోడ్డుపై తిరిగాడే ఆటోలు, కార్లు తరచూ మెకానిక్ షెడ్‌లకు పోకతప్పడం లేదు. రోడ్లను మరమ్మతులు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిచేసినా పట్టించుకోవడం ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విద్యాబోధన చేసేందుకు వెళ్లే ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ విధులను నిర్వహించేందుకు రోడ్లపై ప్రయాణించడం ప్రాణసంకటంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు పనులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఈనెల 28 నుండి ఎస్‌జిఎఫ్ మండలస్థాయి క్రీడలు...

**పాపన్నపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన పాపన్నపేటలో ఈనెల 28 నుండి మూడు రోజులపాటు ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడలు నిర్వహించనునట్లు మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం మహేశ్వర్లు వెల్లడించారు. మూడు రోజులపాటు వాలీబాల్, కబడ్డీ, కోకో పోటీలు జరుగుతాయని అన్నారు. ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు వారు వెల్లడించారు. మిగతా వివరాలకు 8985536704, 9010735121 నెంబర్లలో నరేష్, రమేష్‌లను సంప్రతించాల్సిందిగా వారు సూచించారు.

## మండలస్థాయి క్రీడాపోటీల సన్నాహక సమావేశం



క్రీడాపోటీలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కొల్చారం, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

గురువారం కొల్చారం మండల వనరుల కేంద్రంలో మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణ సన్నాహక సమావేశం మండల విద్యాధికారి సత్యనారాయణరావు నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా మండల స్థాయి క్రీడాపోటీలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడా విభాగాలలో ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నేరుగా జిల్లా స్థాయికి ఎంపిక చేయబడి పంపబడతారని అన్నారు. మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 28, 29,30 తేదీలలో రంగంపేటలో నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రంగంపేట పిడి శ్రీధర్‌రెడ్డి, అన్ని పాఠశాలల పిఈటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. క్రీడాకారులు అండర్17 విభాగంలో 01.01.2009 తర్వాత అండర్14 విభాగంలో 01.01.2012 తర్వాత జన్మించి ఉండాలన్నారు. క్రీడలలో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా బోనఫైడ్ సర్టిఫికేట్ తీసుకొని రావాలని తెలిపారు.

## ఎరువుల కొరత వదంతులు నమ్మొద్దు...

**పావన్నపేట, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

ఎరువుల కొరత ఉందన్న వదంతులు నమ్మొద్దని పావన్నపేట మండల వ్యవసాయ అధికారి నాగమాధురి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతు కొంతమంది రైతులు తొందరపడి సెప్టెంబర్ మాసానికి కావాల్సిన యూరియాను ఇప్పుడే కొనుగోలు చేస్తుండటంతో, కొరత కనిపిస్తుందన్నారు. రాబోయే పదిరోజుల్లో జిల్లాకు 1000 నుండి 1500 టన్నుల యూరియా వస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారని చెప్పారు. సెప్టెంబర్ మాసానికి సరిపడా 4వేల టన్నుల యూరియా అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. చిరుపొట్ట దశలో వేసే ఎరువులు సెప్టెంబర్ నెలలోనే వేయాలని సూచించారు.

## నిరుపేదలకు వరం సిఎంఆర్ఎఫ్

**-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి..**

**కొల్చారం, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

కొల్చారం మండలంలోని ఎనగండ్ల గ్రామానికి చెందిన మన్నె మణికంఠ అనారోగ్యరీత్యా ప్రైవేటుఆసుపత్రిలో చికిత్స చేయించుకుని,ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా వారికి ప్రభుత్వం నుండి మంజూరైన రూ.12,000 చెక్కులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎనగండ్లగ్రామంలో గురువారం లబ్దిదారు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల మాజీ జెడ్పిటిసి పాశం శ్రీనివాస్‌రెడ్డి, పాశం మానసరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.